అన్నదాతకు అండగా ఆర్బీకేలు

- సాగు సమయంలో సూచనలు, సలహాలు
- ఎరువులు, వ్యవసాయ పరికరాలు సరఫరా
- పంట బీమా, ఈ–క్రాప్ నమోదులో అన్నదాతకు చేదోడుగా సిబ్బంది

కాకినాడ రూరల్ మండలంలో వివరాలు:
గ్రామాలు : 41
రైతు భరోసా కేంద్రాలు : 35
మండలంలో ప్రధాన పంటలు:
వరి, పెసర, మినుము, వేరుశనగ తదితర వాణిజ్య పంటలు

కాకినాడ సిటీ: విత్తనం వేసినప్పటి నుంచి పంట దిగుబడి కొనేంత వరకు ప్రభుత్వం రైతుల పట్ల ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాగు పరికరాలు సరఫరా చేస్తోంది. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు పడిగాపులు పడాల్సిన దుస్థితి తప్పింది. ప్రతి ఏడాది ఆర్బీకేల్లోనే ఎరువులు, విత్తనాలు సకాలంలో సరఫరా చేస్తోంది. రైతు సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయ వ్యవసాయ, సహాయకులు రైతులకు నేస్తాలుగా మారారు. సాగు ప్రారంభానికి ముందు నుంచే సలహాలు ఇస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గతం కంటే సాగు విస్తీర్ణంతో పాటు పంట దిగుబడులు పెరిగాయి.

నాటి పరిస్థితి అలా..
చంద్రబాబు పాలనలో వ్యవసాయం దండగ అన్నారు. సాగుకు శాశ్వత విరామం ప్రకటించాలని రైతులకు పిలుపునిచ్చారు. పంటలు వదిలి ప్రత్యామ్నాయం వైపు చూడాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పంట దిగుబడులు అమ్ముకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఒక్క మాటలో చెప్పాలంటే రైతుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం చులకన భావం చూపించింది.

నేటి పరిస్థితి అందుకు భిన్నం..
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత సాగు పద్ధతుల్లో సమూల మార్పులు తీసుకువచ్చారు. రైతన్నలకు జగనన్న ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. పంట పండించాలన్న కోరిక రైతుల్లో బలంగా పెరిగింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ఇంటి వద్దకు ప్రభుత్వ సేవలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. సాగు చేపట్టాలన్న ఆలోచన ప్రతి రైతుకూ కలిగింది.



రైతు వద్దకు ప్రభుత్వ సేవలు



ఆర్బీకేల ద్వారా రైతుల వద్దకు ప్రభుత్వం సేవలను తీసుకుని వెళుతున్నాం. రైతులు ఆర్బీకేలకు వచ్చి వారి సమస్యను తెలియజేస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను సాగు సీజన్‌లో అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది మరింత చేరువయ్యారు.

– **ఏవీ రాజేష్**, కరప మండల వ్యవసాయాధికారి

ఆర్బీకేలు అండగా ఉన్నాయి



నేను విత్తనాలు, ఎరువుల కోసం గతంతో మండల కేంద్రానికి వెళ్లి రోజంతా కాపలా కాసేవాడిని. ఉదయం నుంచి సాయంత్రం వరకు లైన్లో ఉండి తోపులాటలు జరిగితే రెండు బస్తాల విత్తనాలు ఇచ్చేవారు. ఎరువులదీ అదే పరిస్థితి. విత్తనాలు, ఎరువులకు వెళ్లిన రోజు పొలంలో పని చేసేందుకు కూలీని పెట్టేవాడిని, నాకు రోజంతా పని లేకుండా పోయేది. జగనన్న వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలు తమకు అండగా నిలబడుతున్నాయి. ఇక్కడే ఇస్తున్నారు. అదనపు వ్యయం కూడా తగ్గింది.

– **బండే వీరబాబు**, రైతు, వేములవాడ, కరప మండలం

క్లుప్తంగా

రేషన్ పంపిణీపై జేసీ తనిఖీ


రమణయ్యపేటలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ రమణయ్యపేట పరిధిలోని పలు రేషన్ దుకాణాలను జాయింట్ కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య శుక్రవారం తనిఖీ చేశారు. ఇంటింటికీ రేషన్ అందించే వాహనాల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ తీరు, కొలతలు తదితర వాటిని పరిశీలించారు. వినియోగదారులతో మాట్లాడి రేషన్ పంపిణీపై ఆరా తీశారు.

జాతీయ స్థాయి చెస్ పోటీల్లో కిరణ్ సుందర్ ప్రతిభ


కిరణ్‌సుందర్‌ను అభినందిస్తున్న పూర్ణచంద్రరావు

బాలాజీచెరువు: జాతీయ స్థాయి చెస్ పోటీలలో ప్రగతి డిగ్రీ కళాశాలకు చెందిన డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థి జి.కిరణ్‌సుందర్ ప్రతిభ చూపాడు. తమిళనాడు భారతి దాసన్ యూనివర్సిటీ గత నెల 26 నుంచి 29 వరకూ సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ చెస్–మెన్ పోటీలు నిర్వహించగా 12 రాష్ట్రాల వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో కిరణ్ సుందర్ ప్రతిభ చూపి కెప్టెన్‌గా నిలిచి సర్టిఫికెట్ సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల అవరణలో శుక్రవారం కిరణ్‌సుందర్‌ను కళాశాల చైర్మన్ పి.పూర్ణచంద్రరావు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

దంతాలను సంరక్షించుకోవాలి

బోట్‌క్లబ్: నోటి అనారోగ్యం శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉన్నందున దంతాలను సంరక్షించుకోవాలని ప్రముఖ దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం, కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోట్‌క్లబ్‌లో శుక్రవారం జాతీయ పంటి నొప్పి నివారణ దినోత్సవం నిర్వహించారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన

కరప: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపు మేరకు మండలంలోని ఆశా వర్కర్లు శుక్రవారం కరపలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. అనంతరం మండలశాఖ కార్యదర్శి ఆర్.వెంకటలక్ష్మి తదితరులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు.

విధులు బహిష్కరించి..
కాకినాడ సిటీ: ఆశా వర్కర్ల నిర్బంధాన్ని నిరసిస్తూ శుక్రవారం ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరించి నగరంలో ర్యాలీ నిర్వహించి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆశా నాయకులు రెడ్డి సత్యవతి. మద్దెల భారతి ప్రియ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

యండమూరులో జయహో బీసీ సదస్సు

కరప: మండలంలోని యండమూరులో శుక్రవారం టీడీపీ జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి యనమల కృష్ణుడు హాజరై టీడీపీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం దక్కిందని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తేవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు నులికుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పిఠాపురం: వేసవికాలం సమీపించడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కేవీవీ చౌదరి తెలిపారు. గొల్లప్రోలు మండలం మల్లవరం వాటర్ ప్లాంట్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అనంతరాజు, శ్రీదేవిలతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహించిన అధికారులు మోటార్ల పనితీరు, పైపులైన్ల పరిస్థితి, ఫిల్టర్ బెడ్‌ల కెపాసిటీని పరిశీలించారు. వాటర్ ప్లాంట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రాజెక్టు ప్రధాన టాంకు వద్ద చెత్తా,చెదారం పెరిగిపోవడంతో వాటిని వెంటనే తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శివారు ప్రాంతాలైన చినజగ్గంపేట, కొడవలి, కేహెచ్‌పేట తదితర ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందడం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు నీరు సక్రమంగా పంపిణీ చేయడానికి కావాల్సిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏఈ గౌతు రమణను ఆదేశించారు.

రవాణా రంగాన్ని కార్పొరేట్‌పరం చేయొద్దు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శేషుబాబ్జీ

కాకినాడ సిటీ: రవాణా రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం సుందరయ్యభవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ అధ్యక్షతన వివిధ ట్రాన్స్‌పోర్టు సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ప్రభుత్వ అసలు ఉద్దేశం ప్రమాదాలు నివారించడం కాదని, రవాణా రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు అప్పగించడమేనని సమావేశం విమర్శించింది. ఈనెల 16న దేశవ్యాప్త ట్రాన్స్‌పోర్టు బంద్‌కు వాహనాల డ్రైవర్లు, యజమానులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు బి సత్యనారాయణ, ఎస్ చంద్రశేఖర్, తాతపూడి మూర్తి, ఎం వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీలను కలసిన అధికారులు


కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసిన డీఈవో పిల్లి రమేష్, ఏఎస్పీ భాస్కరరావు

కాకినాడ సిటీ: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన పిల్లి రమేష్, ఎంజీవీ భాస్కరరావులు శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ప్రవీణ్ ఆదిత్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారిగా పని చేస్తున్న పిల్లి రమేష్ కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీగా పని చేస్తూ కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీగా నియమితులైన ఎంజీవీ భాస్కరరావు బాధ్యతలు స్వీకరించిన అనంతర కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు.

నేమాం బీచ్‌కు పోటెత్తిన భక్తులు


నేమాం బీచ్ వద్ద సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

కాకినాడ రూరల్: చొల్లంగి అమావాస్య సందర్భంగా కాకినాడ రూరల్ మండలం నేమాం బీచ్‌లో పుణ్య స్నానాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి మండల పరిధిలోని నేమాం, పండూరు, పి.వెంకటాపురం, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనాలు తరలివచ్చి స్నానాలు చేసి, అనంతరం గ్రామంలోని శివాలయంలో దర్శనాలు చేసుకున్నారు. నేమాంతో పాటు సూర్యారావుపేట బీచ్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చిన జనాలు స్నానాలు ఆచరించి సూర్యారావుపేట శివాలయంలో దర్శనాలు చేసుకున్నారు.


నేమాం బీచ్ వద్ద సముద్ర స్నానాలకు వెళ్లే మార్గంలో భక్తుల రద్దీ

గాటీలమ్మకు ప్రత్యేక పూజలు
బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ బ్రిడ్జి కింద ఉన్న గాటీలమ్మ అమ్మవారి ఆలయంలో చొల్లంగి అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ దంత వైద్యుడు కృష్ణ మోహన్ సౌజన్యంతో ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తలాటం హరీష్ పాల్గొన్నారు.

రజక ఆస్తులకు రక్షణ కల్పించాలి


జిల్లా రజక మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

కాకినాడ సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా రజక వృత్తిదారుల ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని వాటికి రక్షణ కల్పించాలని, రజకులకు ఉపాధి, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం కాకినాడ సుందరయ్యభవన్‌లో సంఘం జిల్లా ఆరో మహాసభ జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు అధ్యక్షతన జరిగింది. రజకుల సమస్యలు పేరుకుపోయాయని, తమకు అన్యాయం జరుగుతుందన్నారు. కుటుంబ పోషణ, ఉపాధి నిమిత్తం వేరే ప్రాంతాలకు వలస పోతున్నారని, వాటిని అరికట్టాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో సుమారు 25 లక్షల రజక కుటుంబాలు ఉన్నాయని, వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో బతుకుదెరువు చాలా కష్టంగా మారిందన్నారు. తమ హక్కుల కోసం, జీవోల అమలు కోసం ఉద్యమం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు ముస్నూరు భాస్కరయ్య, మడక రాజు, కాకినాడ రామారావు, కె.నాగేశ్వరరావు, కె.మాణిక్యం, మెంటారావు, ఈశ్వరరావు, గొల్తి సత్యనారాయణ, పోలేపల్లి నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో ఉద్యానవనం అభివృద్ధి


పార్కు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈఈ మాధవి, అధికారులు

కాకినాడ: రాజీవ్ గృహకల్ప ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో రూ.10 లక్షలతో అక్కడి ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఉద్యానవనాన్ని అభివృద్ధి చేస్తున్నారు. స్థానిక 11వ డివిజన్‌లో గృహకల్ప సముదాయాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ దృష్టి సారించింది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచన మేరకు అక్కడ ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద గ్రానైట్ అమర్చి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి ఆ ప్రాంత ప్రజలు సేదతీరేందుకు వీలుగా బెంచీలు, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం రూ.10 లక్షలు వెచ్చించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నగరపాక సంస్థ ఈఈ మాధవి, డీఈ లక్ష్మి, ఏఈ వై.నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలోనే వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఈఈ తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ వేసుకోవాలి


ఆల్బెండజోల్ మాత్రను మింగిస్తున్న ఐసీడీఎస్ పీడీ ప్రవీణ


నులి పురుగుల నివారణ, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నియంత్రణాధికారి రమేష్

కాకినాడ సిటీ: జిల్లాలో శుక్రవారం చేపట్టిన నులిపురుగుల నివారణా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి కె.ప్రవీణ స్థానిక గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న చిన్నారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు డీ వార్మింగ్ డేలో భాగంగా ఈ మాత్రలను మింగించేలా అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించినట్లు పీడీ తెలిపారు.

కరప: ఆరోగ్య పరిరక్షణకు ఏడాది చిన్నారుల నుంచి 19 ఏళ్ల వయసున్న బాల, బాలికలు అందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కోరారు. స్థానిక మహాత్మ జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయంలో శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ (డీ వార్మింగ్ డే) దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కడుపులో నులిపురుగుల నివారణకు ఈ మాత్రలు పనిచేస్తాయన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ కరప పీహెచ్‌సీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు 7,772 మంది ఉన్నట్టు గుర్తించామని, వీరికి ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు తదితర వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులతో కలసి ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణారావు, సీహెచ్‌ఓ వై.రత్నకుమారి, ఎస్.ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు. వేళంగి పీహెచ్‌సీ పరిధిలో చిన్నారులు, విద్యార్థులు 4,986 మంది ఉన్నట్టు గుర్తించి, ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్టు డాక్టర్ ఎంకే సౌజన్య తెలిపారు. వేళంగి హైస్కూలులో సర్పంచ్ ఎస్.నీలిమ, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్‌ఎం భారతి తదితరులు విద్యార్థులతో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.

నులి పురుగుల నిర్మూలనపై అవగాహన
కాకినాడ రూరల్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గైగోలుపాడులోని అర్బన్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ, చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.రమేష్ శుక్రవారం అవగాహన కల్పించారు. నవభారత్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలు, కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలను డీఎం అండ్ హెచ్‌ఓ నరసింహ నాయక్ ఆధ్వర్యంలో అందజేశామన్నారు. కార్యక్రమంలో అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనుచంద్ర, పాఠశాల చైర్మన్ జార్జి ముల్లర్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన


పోలింగ్ కేంద్రాల్లో వసతులపై సూచనలిస్తున్న ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్లా ఆదేశాల మేరకు నియోజకవర్గ ఈఆర్‌ఓ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శుక్రవారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. జగన్నాథపురంలోని ముత్తానగర్, ఎస్ఆర్కె స్కూల్, ఉమెన్స్ కాలేజీ, గర్ల్స్ హైస్కూల్, ఎంఎస్‌ఎన్ స్కూల్, ఆంధ్ర పాలిటెక్నిక్ ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న సదుపాయాలను గురించి ఆరా తీశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద విద్యుత్, మంచినీరు, ఫర్నిచర్ వంటి సదుపాయాలు ఉన్నాయో లేదో పరిశీలించారు. పూర్తిస్థాయిలో వసతులు లేని పక్షంలో అందుకు సంబంధించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు ఎన్నికల సిబ్బంది, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు ఉన్నారు.

11న పంచవక్త్ర విరాట్ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ


తాళ్లరేవులో ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న గోవిందకుమార్

తాళ్లరేవు: ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎదుర్లంక వారధి వద్ద నూతనంగా నిర్మించిన పంచవక్త్ర విరాట్ హనుమాన్ ప్రతిష్ఠా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ కోరారు. శుక్రవారం ఈ మేరకు తాళ్లరేవులో ఏర్పాటు చేసిన ప్రచార ఆటోను గోవిందకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న స్వామివారి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ పెద్దఎత్తున తరలివచ్చి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష, ఉప సర్పంచ్ కామాడి భైరవమూర్తి, నాయకులు రేవు మల్లీశ్వరి, ఆకుల వెంకటేశ్వర్లు, పెయ్యల శ్రీనివాస్, పెసింగి వర్మ, కర్రి ఆదినారాయణ, బొంతు మోహన్, గెద్దాడ బూరియ్య, కట్టి మేను విష్ణు, రేవు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి



వలంటీర్లతో మాట్లాడుతున్న నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని, వీటిని ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలకంగా పనిచేశారని నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని వాకలపూడి గ్రామంలోని నాలుగు సచివాయాల పరిధిలో గల వలంటీర్లతో రమణయ్యపేట వైద్యనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ లబ్ధిని తెలియజేస్తూ, సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సహకరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేదలకు చేస్తున్న మంచిని తెలియజేయాలని కోరారు. మరో అతిథిగా మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్ మాట్లాడుతూ వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు వలంటీర్లకు ఎంతో గౌరవం ఇస్తున్నారని, ప్రభుత్వానికి, ఆయనకు మంచి పేరు తీసుకువచ్చేలా పనిచేయాలన్నారు. వాకలపూడి గ్రామ నాయకులు గొల్లపల్లి జగన్, కరీం బాషా, విజయ సారథి, నల్లా శ్రీను, కర్రి చక్రధర్, గంపల సత్యనారాయణ, భవాని, తదితరులు మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలోని ప్రజల సమస్యలను ఎమ్మెల్యే కన్నబాబు, అధికారుల దృష్టికి తీసుకువస్తే తాము వాటి పరిష్కారానికి తాము కృషి చేస్తామన్నారు.

వెంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు


యండమూరులో స్వామివారికి జన్మనక్షత్ర పూజలు, వ్రతాలు చేస్తున్న భక్తులు

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని వెంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులతో వెంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, వ్రతాలు చేయించుకుని, స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కరప విష్ణ్వాలయంలోని వెంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, కొంగోడు, వేళంగి తదితర గ్రామాల్లోని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మనక్షత్ర పూజలు నిర్వహించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


కేలండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అభివృద్ధికి పునరంకితమవుతామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. బీఎస్ఎల్, ఎల్ఐసీ వంటి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారుల ఆధ్వర్యంలో స్థానికంగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆయా పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఏసుబాబు మాట్లాడుతూ కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతోనే వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరుతో పట్టణ ప్రాంతాల్లో ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు ప్రయోజనం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, బీజేపీ నాయకులు గట్టి సత్యనారాయణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కిమిడి దుర్గాప్రసాద్ (30) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం దుర్గా ప్రసాద్ చీడిగ గ్రామంలో ఒక భవన నిర్మాణ పనిలో ఉండగా ప్రమాదవ శాత్తూ గత నెల 8న పై నుంచి జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై సూర్య ప్రకాష్ తెలిపారు.